క్లుప్తంగా

అర్వపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం తనిఖీ



అర్వపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

అర్వపల్లి : మండల పరిధిలోని అర్వపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం డీపీఓ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. అలాగే పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తిరునగరి గోపి, పంచాయతీ కార్యదర్శి డి.నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ బాలుర పాఠశాలలో శిక్షణ శిబిరం

సూర్యాపేట : ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో అవసరమయ్యే గదుల సౌకర్యం లేకపోవడంతో ఈ సారి జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాల(పోలీస్ స్టేషన్ పక్కన)లో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బాల కేంద్రం సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి అడ్మిషన్లు, శిక్షణ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్లు జిల్లా బాల భవన్‌లో తీసుకోవాలని, విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకరావాలని సూచించారు.

నేడు అర్వపల్లికి కలెక్టర్, ఎమ్మెల్యే రాక

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 11.30 గంటలకు భూభారతి చట్టంపై నిర్వహించే అవగాహన సదస్సుకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎమ్మెల్యే సామేల్ రానున్నారని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్

తిరుమలగిరి : రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఈదులపర్రె తండాలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్, డాక్టర్ రవి, ప్రసాద్, నవీన్, స్వప్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



అర్వపల్లి సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్లకు రేడియం పెయింట్ వేయిస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

అర్వపల్లి : అర్వపల్లిలో హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ తెలిపారు. అర్వపల్లిలో వైజంక్షన్ నందు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు బుధవారం రేడియం పెయింట్ వేసే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బైరబోయిన రామలింగయ్య, స్థానికులు పాల్గొన్నారు.

స్నేహితుడికి సన్మానం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బండారి బంగారి కుమారుడు బండారి నవీన్‌కుమార్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నందు తెలుగు విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశం పొందారు. ఈ సందర్భంగా తనతో పాటు చదువుకున్న 2010–11 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గ్రామంలో బుధవారం అతడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ హరీష్, ఓర్సు నరేష్, బాల్నె ఉదయ్, పెంటగాని మహేష్, బింగి నాగరాజు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

కోదాడరూరల్ : మద్యంతాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఓ వ్యక్తికి జరిమానాతో పాటు ఒక్క రోజు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణంలో మంగళవారం రాత్రి రంగా థియేటర్ సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరు పరచగా జడ్జి ఒకరికి రూ.2వేల జరిమానాతో పాటు ఓ రోజు జైలుశిక్ష, మరొకరికి రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నర్సరీల్లో మొక్కలు ఎండకుండా..

- వేసవిలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న సిబ్బంది
- చలువ పందిళ్లు ఏర్పాటు.. ఎప్పటికప్పుడు నీటి సరఫరా
- వన మహోత్సవం లక్ష్యం చేరుకునేలా అధికారుల ప్రణాళిక



అనంతారం గ్రామంలోని వన నర్సరీలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

పెన్‌పహాడ్ : రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం పేరిట ప్రతి ఏటా గ్రామాల్లో మొక్కలను నాటిస్తోంది. నాటిన మొక్కలను సంరక్షించడమే లక్ష్యంగా ముందుకెళ్తోంది. వర్షాకాలంలో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమానికి వివిధ రకాల మొక్కలను ఇప్పటి నుంచే ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పెంచుతున్నారు. జనవరిలో నర్సరీలను సిద్ధం చేసి మిశ్రమ మట్టితో నింపిన ప్లాస్టిక్ సంచులలో విత్తనాలను వేశారు. విత్తనాలు మొలకెత్తి ప్రస్తుతం వివిధ దశలో ఎదిగే దశలో ఉన్నాయి. నర్సరీలలో ఎదిగే దశలో ఉన్న వివిధ రకాల మొక్కలపై ఎండ తగలకుండా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా మండలంలో 2 లక్షల 87వేల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఎండకు మొక్కలు దెబ్బతినకుండా నీటిని అందిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అన్ని నర్సరీల్లో గ్రీన్ మ్యాట్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

2లక్షల 87వేల మొక్కల పెంపకం..

పెన్‌పహాడ్ మండల వ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీ ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 8 వేల నుంచి 13వేల వరకు మొక్కలను పెంచుతున్నారు. ప్రతి గ్రామంలో ఉన్న నర్సరీల్లో మొక్కల సంరక్షణకు వన సేవకుడిని నియమించారు. వీరు నర్సరీల్లో విత్తనాలు వేసిన మొదలు మొక్కలుగా ఎదిగే వరకు తగు చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీల్లో బెడ్‌లుగా అమర్చిన మొక్కల మధ్యలో పిచ్చి మొక్కలు, కలుపు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అదే విధంగా ఏపుగా పెరిగిన మొక్కలను ఒక చోటుకు మారుస్తున్నారు. నర్సరీలలో నిరంతరం సంరక్షణ పనులు చేపడుతున్నారు.

గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేశాం



వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రతి గ్రామంలో అవసరమైన వివిధ రకాల మొక్కలను ఆయా గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్నాం. మండల వ్యాప్తంగా 29 నర్సరీల్లో 2లక్షల 87వేల మొక్కలను పెంచుతున్నాం. మొక్కలు ఎండకు దెబ్బతినకుండా నర్సరీలో గ్రీన్‌మ్యాట్‌తో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం.

– రవి, ఏపీఓ

రైతులకు మరింత చేరువయ్యేలా..



తిమ్మాపురంలోని రైతువేదిక



రైతువేదికలో వైరింగ్ చేస్తున్న సిబ్బంది

- వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌గా తిమ్మాపురం రైతువేదిక
- కొనసాగుతున్న కేబుల్ బిగింపు పనులు
- అన్నదాతలందరికీ 'రైతునేస్తం' సేవలు అందేలా..

అర్వపల్లి: రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులందరికీ మరింత చేరువ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం రైతువేదికలో ఇప్పటికే రైతునేస్తం కార్యక్రమం ద్వారా ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. ఈ సేవలను మరింత విస్తృతం చేసేందుకు గాను తిమ్మాపురం రైతు వేదికలోనూ వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

తిమ్మాపురం రైతు వేదికలో మొదలైన పనులు

జాజిరెడ్డిగూడెం మండలంలో రామన్నగూడెం, తిమ్మాపురంలో రెండు రైతు వేదికలు ఉన్నాయి. రామన్నగూడెం రైతువేదికను మూడేళ్ల కిందట మొదటి విడతలో వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌గా మార్చారు. తాజాగా తిమ్మాపురం రైతు వేదికను కూడా రైతునేస్తంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ కేంద్రంగా మారుస్తున్నారు. ప్రస్తుతం ఈ వేదికలో కేబుల్ బిగించడం, ఇతర పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తికాగానే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించనున్నారు.

సలహాలు అందనున్నాయి



తిమ్మాపురం రైతు వేదికను వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌గా మార్చాలని నిర్ణయించడం చాలా సంతోషకరం. ఈ కేంద్రం రైతునేస్తంగా మారితే వివిధ పంటల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందనున్నాయి.

– బంటు యాదగిరి, రైతు, అడివెంల

పనులు కొనసాగుతున్నాయి



రామన్నగూడెం రైతువేదికను గతంలోనే వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌గా మార్చాం. ప్రతి మంగళవారం రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇస్తున్నాం. తిమ్మాపురం రైతువేదికను కూడా వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌గా మార్చే పనులు జరుగుతున్నాయి.

– పెందోట గణేష్ ఏఓ

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య



పొట్టి శ్రీరాములు సెంటర్‌లో నిరసన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు



తిరుమలగిరిలో కొవ్వొత్తులతో నిరసన..

తాళ్లగడ్డ (సూర్యాపేట) : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అన్నారు. ఉగ్రవాదులు పహల్గాంలోని పర్యాటక స్థలంలో సుమారు 28 మంది భారతీయ పౌరులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పీఎస్ఆర్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా శ్రీలత రెడ్డి మాట్లాడారు. శాంతియుతంగా ఉన్న జమ్మూ కశ్మీర్లో ఉగ్రవాదులు దాడికి పాల్పడటాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. ఉగ్రవాదులను తుద ముట్టించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ పెంచి పోషించడాన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని తెలిపారు. భారతీయ పౌరుల మతాన్ని నిర్ధారిస్తూ ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడటం అమానవీయ చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేందర్, నాయకులు చలమల్ల నరసింహ, గజ్జల వెంకటరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, అబీద్, పంతంగి సాలయ్య, పర్వతం శ్రీధర్, పర్వతం సంధ్యారాణి, బైరు విజయకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన..

తిరుమలగిరి : ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య తుంగతుర్తి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా బుధవారం రాత్రి తిరుమలగిరి మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు స్వామి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు ధీన్ దయాళ్, కొండ సోమయ్య, సంతోష్ నాయక్, మూల వెంకటరెడ్డి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

27న 'మోడల్' ప్రవేశ పరీక్ష

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో చేరడానికి ఈ నెల 27న 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మోడల్ స్కూల్‌లో చేరడానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 7, 8, 9, 10 తరగతులలో చేరే విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

అగ్నివీర్‌కు ఎంపిక



ముఖేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తుంగతుర్తి : మండల పరిధిలోని శ్రీవిద్యాభారతి పాఠశాల పూర్వవిద్యార్థి మట్టపల్లి ముఖేష్ అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని పాఠశాలలో ఉపాధ్యాయులు బుధవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చేపూరి కృష్ణయ్య, ప్రిన్సిపల్ పి.మల్లయ్య, పాఠశాల డైరెక్టర్లు కోట వెంకటగోపాల్, ఎండీ నజీర్, ఉపాధ్యాయులు లింగమూర్తి, సురేష్, అంబటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిసకావొద్దు



మాట్లాడుతున్న డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య

పెన్‌పహాడ్ : యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య అన్నారు. బుధవారం అనాజిపురంలో ఏర్పాటు చేసిన పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆత్యాశకు పోయి గుప్త నిధుల తవ్వకాలు జరపొద్దని, మూఢ నమ్మకాలతో నరబలి, జంతుబలి వంటి వాటికి పాల్పడి కేసుల పాలు కావొద్దని గ్రామస్తులకు సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగ్, లోన్ యాప్‌లకు అలవాటు పడి కొందరు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. యువకులు, విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతోపాటు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. గ్రామాల్లో జరిగే వ్యవహారాలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



చెన్ను మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చెన్ను ప్రభాకర్ రెడ్డి తండ్రి చెన్ను మల్లారెడ్డి, కొండేటి వీరారెడ్డి తల్లి కొండేటి గోపమ్మలు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. బుధవారం మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ సర్పంచ్ దొంగరి సుధాకర్ కాలికి గాయమై బాధపడుతుండగా ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్‌లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, మేకల శ్రీనివాస్, జానకిరాములు, జగన్, అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యార్థులకు ఎంతో మేలు



మాట్లాడుతున్న ఎంఈఓ ధారాసింగ్

ఆత్మకూర్(ఎస్) : విద్యార్థుల్లో చురుకుదనం, సమస్య సాధన, కంప్యూటర్ మీద అవగాహన పెంపొందించడం కోసం ఏఐ బోధన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల విద్యాధికారి ధారాసింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏనుబాముల ప్రాథమిక పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ లిటరసీ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కరి కులం పైలట్ ప్రాజెక్టుకు ఎంపీపీఎస్ ఏనుబాముల పాఠశాల ఎంపికై నందున ఇక్కడి విద్యార్థులు డిజిటల్ విజ్ఞానాన్ని కనబరుస్తున్నారని తెలిపారు. గణితం నేర్చుకోవడంలో ఏఐ ఉపయోగాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు భరణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరారెడ్డి, ఉపాధ్యాయులు వెంకన్న, లింగరాజు, వెంకటమ్మ, వెంక్యా, పిల్లల తల్లిదండ్రులు శాంత కుమార్, కోటీశ్వరి, లక్ష్మి, నీలమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య



అర్వపల్లి : సూర్యనాయక్‌తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూర్(ఎస్) : ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని సూర్యనాయక్‌తండా హెచ్‌ఎం కైరంకొండ రమేష్ అన్నారు. బుధవారం తండాలో బడిబాట ర్యాలీని నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ పాఠశాలకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ తార, వెంకన్న, అంగన్‌వాడీ టీచర్ బూబ, రాము, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం శ్రవణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ప్రచారం నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కరపత్రాలను పంచుతూ ఇంటింటి ప్రచారం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాగారం : వర్ధమానుకోటలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయురాలు సోనీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వర్ధమానుకోట ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాల వద్దు -ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అనే నినాదంతో బడి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాల పంపిణీ



ప్రగతి పత్రాలను అందజేస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం

అర్వపల్లి : వేసవి సెలవుల్లో విద్యార్థులు తాము వెళ్లే పైతరగతులకు సంబంధించిన అంశాలను ప్రతి రోజూ గంటపాటు నేర్చుకోవాలని అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీదేవి కోరారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు. పీఎంశ్రీ పథకంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి కంప్యూటర్ విద్య, తదితర అంశాలు అందనున్నాయని చెప్పారు. అనంతరం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ సునీతారాంబాబు, వేణుగోపాల్‌రావు, ఉపాధ్యాయులు మధుకర్, ప్రసన్న, శోభారాణి, స్వర్ణలత, నాగయ్య, అంజలి, సునంద, ప్రశాంతి, పీడీ పి.మల్లేష్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం కోసం కృషిచేయాలి



కొమ్మాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : క్షయరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జాజిరెడ్డిగూడెం మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. మండల పరిధిలోని కొమ్మాలలో బుధవారం క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మందికి పరీక్షలు జరిపారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, 60 ఏళ్లు పైబడిన వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, టీబీ నోడల్ పర్సన్ వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వశ్రిత, హెల్త్ అసిస్టెంట్‌లు సరస్వతి, ఊర్మిళ, ఆశా కార్యకర్తలు కవిత, రోజ, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

భానుపురి : బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న కార్మిక వర్గ, రైతాంగ వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, ఐఎన్‌టీయూసీ నాయకులు కాసర్ల శ్రీను, వల్దాస్ శ్రీను (రెబల్), రాంబాబు, దేశోజు మధు, ఖమ్మంపాటి రాము, పాపన్న పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు వైద్యపరీక్షలు



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు వైద్యపరీక్షలు చేస్తున్న ఎంపీహెచ్ఏ సరస్వతి

అర్వపల్లి : వడదెబ్బ బారిన పడకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొమ్మాల పల్లెదవాఖాన ఎంపీహెచ్ఏ అనంతుల సరస్వతి కోరారు. బుధవారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు, హమాలీలకు వైద్యపరీక్షలు జరిపారు. అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కవిత, శోభ, విజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

మునగాల : మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లు ఆవరణలో నిర్వహించిన మునగాల రైస్‌మిల్ హమాలీ కార్మికుల సమావేశంలో వారు పాల్గొని సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలో అన్ని కూడళ్ల వద్ద, రైస్‌మిల్లుల ఆవరణలో, సంస్థలు, అడ్డాల వద్ద అన్ని రంగాలకు చెందిన కార్మికులు మే 01న జెండాలు ఎగురవేసి మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో బీఆర్‌టీయూ మున్సిపల్ యూనియన్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరెంపుల వెంకటాద్రి, బీఆర్‌టీయూ హమాలీ యూనియన్ నాయకులు రేసు సైదులు, లొడంగి సోమయ్య, మండల హమాలీ యూనియన్ నాయకులు సోము అప్పయ్య, లొడంగి సత్యం, చింతకాయల లింగయ్య, దేశగాని లింగయ్య, కోల నర్సింహారావు, వెంకటరెడ్డి, చంద్రయ్య, వీరస్వామి, కుటుంబరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్లు



వీల్‌చైర్లు అందజేస్తున్న సూపర్‌వైజర్ మంగమ్మ

తిరుమలగిరి : తాటిపాముల గ్రామానికి చెందిన నలుగురు దివ్యాంగులకు కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కందుకూరి మంగమ్మ బుధవారం వీల్ చైర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పుష్పలత, సునీత, భూషణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

చిలుకూరు : కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కేంద్రాల వద్ద ధాన్యం ఎండబోసి రోజులు గడుస్తున్నా కాంటాలు వేయడం లేదన్నారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో వెంటనే ధాన్యం కాంటాలు వేయాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కృషి చేస్తుందన్నారు. అనంతరం పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా కనకం రుద్రయ్య, సహాయ కార్యదర్శిగా పుట్టపాక రవి, కమిటీ సభ్యులుగా బాలెబోయిన గురవయ్య, సాతులూరి అలివేలు, గన్నా వెంకటేశ్వర్లు, పిల్లుట్ల చంద్రయ్య, తోడేటి కోటయ్య, పార్వతమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.